క్లుప్తంగా

తహసీల్దార్ ముందు నలుగురు ఎక్సైజ్ నిందితులు



ఎక్సైజ్ కేసులో భీమవరం తహసీల్దార్ ముందు హాజరుపర్చిన నిందితులు

భీమవరం: మద్యం అక్రమ విక్రయాల్లో పట్టుబడిన నలుగురిని మంగళవారం తహసీల్దార్ ఆర్ రాంబాబు వద్ద బైండోవర్ చేసినట్లు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సీఐ కె బలరామరాజు చెప్పారు. భీమవరం పట్టణానికి చెందిన నీతిపూడి శాంతరాజు, వనిమా క్రిష్ణమూర్తి, భీమవరం మండలం దిరుసుమర్రు గ్రామానికి చెందిన గెద్దం ఏసురాజు, సంగినీడి వెంకటసతీష్‌లను సెక్షన్ 127 కింద తహసీల్దార్ వద్ద హాజరుపర్చామని పై నలుగురు అక్రమంగా మద్యం విక్రయిస్తు మరొకసారి పట్టుబడితే రూ.లక్ష జరిమాన కట్టాల్సి ఉంటుందని బలరామరాజు తెలిపారు.

ఆధార్ మొబైల్ క్యాంపులను వినియోగించుకోవాలి

కాళ్ల: గ్రామాల్లో నిర్వహిస్తున్న ఆధార్ మొబైల్ క్యాంపులను వినియోగించుకోవాలని ఎంపీడీఓ జి.స్వాతి తెలిపారు. మండలంలో 8 చోట్ల ఆధార్ మొబైల్ క్యాంపులను ఏర్పాటు చేసినట్లు ఆమె మంగళవారం విలేకరులకు తెలిపారు. బుధవారం నుంచి ఎనిమిది రోజులపాటు జరిగే ఈ క్యాంపులను ప్రతి ఒక్కరూ సద్వినియోగపరచుకోవాలని కోరారు. మాలవానితిప్ప, పెదఅమిరం, మోడి, కాళ్ల, దొడ్డనపూడి, సీసలి, ప్రాతాల్లమెరక, ఏలూరుపాడు సచివాలయాల్లో ఆధార్ క్యాంపులను ఏర్పాటు చేశామన్నారు. వీటికి సంబంధించి అన్ని గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లతో పాటు సిబ్బంది సూచనలు ఇచ్చి ఆయా గ్రామాల్లో చాటింపు వేయించి ప్రజలకు తెలియపర్చామన్నారు. ఆరు సంవత్సరాల లోపు వయసు ఉన్న పిల్లలకు ఆధార్ నమోదు, పేరులో తేడాలు మార్చుకోవచ్చన్నారు.

రామలింగేశ్వర స్వామిని తాకిన సూర్య కిరణాలు



స్వామి వారిని తాకిన సూర్య కిరణాలు

కాళ్ల: మండలంలోని సీసలి గ్రామంలో ఉన్న శ్రీ అన్నపూర్ణ సమేత రామలింగేశ్వరస్వామి ఆలయంలో అద్భుత సన్నివేశం మంగళవారం చోటు చేసుకుంది. ఆలయంలోని శివలింగాన్ని సుమారు పది నిమిషాల పాటు సూర్యకిరణాలు తాకాయని ఆలయ అర్చకులు తెలిపారు. ఆదివారం నుంచి వరుసగా మూడు రోజులపాటు స్వామివారి లింగాన్ని సూర్యకిరణాలు తాకటం విశేషమని తెలిపారు. విషయం తెలుసుకున్న భక్తులు తరలివచ్చి అద్భుత సన్నివేశాన్ని చూస్తూ స్వామివారిని దర్శించుకున్నారు.

షెడ్డు నిర్మాణ పనుల పరిశీలన

కాళ్ల: మండలంలోని కోమటిగుంటలో శ్రీభక్తాంజనేయస్వామి ఆలయం వద్ద నిర్మిస్తున్న షెడ్డు పనులను మంగళవారం నిర్వాహకులు పరిశీలించారు. ఆలయానికి వచ్చే భక్తుల సౌకర్యార్థం దాతల సహకారంతో రూ.5 లక్షలతో భారీ షెడ్ నిర్మిస్తున్నట్లు పేర్కొన్నారు. స్వామి వారికి ప్రతి ఏటా నిర్వహించే ఉత్సవాల సందర్భంగా నిర్వహించే ప్రత్యేక పూజలు సమయంలో ఈ షెడ్డు ఉపయోగకరంగా ఉంటుందని వివరించారు.

పేకాడుతున్న ఏడుగురి అరెస్ట్

భీమవరం: భీమవరం టుటౌన్ పోలీసుస్టేషన్ పరిధిలో పేకాట ఆడుతున్న 7గురిని అరెస్టు చేసినట్లు టూటౌన్ ఎస్సై ఇజ్రాయిల్ మంగళవారం చెప్పారు. టౌన్ రైల్వేస్టేషన్ దగ్గరలోగల ఒక లాడ్జిలో పేకాడుతున్నట్లు సమాచారం అందడంతో దాడి చేసి 7గురు వ్యక్తులను అరెస్టు చేసి వారి వద్ద నుంచి రూ. 6,550 నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై ఇజ్రాయిల్ చెప్పారు.

ప్రకృతి వ్యవసాయంతో భూసారం పెరుగుదల

యలమంచిలి: భూతాపం తగ్గాలన్నా, భూసారం పెరగాలన్నా, మనం తినే ఆహారం ఆరోగ్యాన్ని ఇవ్వాలన్నా రైతులంతా తప్పనిసరిగా ప్రకృతి వ్యవసాయం వైపు మళ్లాలని నరసాపురం ప్రాంతీయ సహాయ వ్యవసాయ సహాయకులు ఈద అనిల కుమారి కోరారు. మేడపాడు రైతు సేవా కేంద్రంలో మంగళవారం నిర్వహించిన ప్రకృతి వ్యవసాయం ఆవశ్యకతపై మండల స్థాయి సమావేశంలో ఆమె మాట్లాడారు. రసాయనిక ఎరువుల వల్ల భూసారం బాగా తగ్గిపోయిందన్నారు. ఆ భూములను మళ్లీ సారవంతం చేయడానికి మళ్లీ రైతులంతా ప్రకృతి వ్యవసాయ చేయాలని ఆమె కోరారు. ప్రకృతి వ్యవసాయ జిల్లా కో–ఆర్డినేటర్ అరుణకుమారి మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయ సిబ్బంది సుమారు 12 కిలోల బరువున్న నవధాన్యాల విత్తనాల కిట్‌ను రూ.850లకే అందజేస్తున్నట్లు ఆమె వివరించారు.

ఆక్వా సాగులో అక్రమ బోర్లు

- పరిసరాలు, పంటలు నాశనం
- అనుమతులు లేకున్నా యథేచ్ఛగా బోర్లు వేస్తున్న ఆక్వా రైతులు
- పట్టించుకోని అధికారులు



ఉండి అర్తమూరు రోడ్డులో అక్రమంగా వేసిన బోరు



ఉండి శివారు ప్రాంతంలో పంటకాలువగట్టుపై బోర్లు

ఉండి: నియోజకవర్గంలో అత్యధిక శాతం మంది రైతులు ఆక్వా సాగు చేస్తూ ఉంటారు. అయితే ఇటీవల కాలంలో ఆక్వా సాగులో అక్రమాల వల్ల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఆది నుంచి ఆక్వా రైతులు నియోజకవర్గంలో వేల సంఖ్యలో అక్రమంగా ఉప్పునీటి బోర్లు తవ్వారు. కేవలం మంచి నీటితోనే ఆక్వా సాగు చేస్తామని అనుమతులు తీసుకుంటున్న రైతులు చెరువు గట్లు, పంట బోదెలు,కాలువ గట్లపై అక్రమంగా కొన్ని వందల అడుగుల లోపలికి బోర్లు వేసి ఉప్పునీటితో దర్జాగా ఆక్వా సాగు చేస్తున్నారు. దీనివల్ల రైతులు లాభపడుతున్నా పర్యావరణానికి తీవ్రంగా హాని కలుగుతుంది. ఆక్వా చెరువులకు అక్రమంగా అనుమతులివ్వడమే కాకుండా ఆక్వా జోన్ పేరిట మరిన్ని అక్రమాలకు నిర్భయంగా అనుమతులు ఇచ్చేస్తున్నారు. నిబంధనలకు లోబడి తవ్వకాలు జరుగుతున్నాయా? లేదా అని కూడా పరిశీలించకుండానే కార్యాలయాల్లో కునికిపాట్లు పడుతూ అనుమతులు మంజూరు చేస్తున్నారు. తవ్వకం పూర్తి కాగానే ఆక్వా రైతులు చెరువుగట్లు లేదా ప్రభుత్వ భూముల్లో అక్రమంగా బోర్లు వేసి ఉప్పునీటిని తోడి సాగు చేస్తున్నారు.

వరి రైతుల ఆవేదన

ఆక్వా రైతులు అక్రమంగా బోర్లు వేయడం వల్ల భూగర్భ జలాలు అడుగంటిపోవడంతో పాటు ఆక్వా చెరువులకు సీఫేజ్ లేకపోవడంతో వాటి వర్షాల వల్ల ప్రక్కనున్న పంటలు పాడవుతున్నాయి.దీ నివల్ల ఎంతో మంది వరిసాగు చేసే రైతులు లబోదిబోమంటున్నారు.అంతే కాకుండా బోరు వేసుకునేందుకు శాఖలతో సంబంధం లేకుండా అధికారులు మామూళ్లకు అలవాటు పడి అక్రమాన్ని సక్రమంగా మార్చేస్తున్నారు. ఎవరైనా దీనిపై ప్రశ్నిస్తే ఆక్వా రైతుకంటే ముందుగానే అధికారులు అనుమతులు ఉన్నాయని సమాధానం ఇచ్చేస్తున్నారు.

అనుమతులెలా?

ఆక్వా చెరువులకు బోర్లు వేసుకునేందుకు అనుమతులు కావాలంటే తహసీల్దార్ ద్వారా జిల్లా కలెక్టర్‌కే లేదా జల వనరుల శాఖకు దరఖాస్తు చేసుకోవాలి. ముందుగా రెవెన్యూ అధికారి బోరు వేసే ప్రాంతాన్ని పరిశీలిచిన అనంతరం జల వనరుల శాఖాధికారులకు దరఖాస్తును పంపిస్తారు. కానీ నూటికి పదిమంది కూడా అనుమతుల కోసం దరఖాస్తు చేసుకోవడం లేదు. అయినా నిర్భయంగా స్థానిక అధికారుల అండదండలతో అక్రమంగా బోర్లు వేసుకుని ఉప్పునీరు తోడుకుంటున్నారు. అయితే ఆక్వా సాగులో ఉప్పునీటి సాగుకు అనుమతులు లేవని అధికారులు చెబుతూనే ఆక్వా రైతులకు వంత పాడుతున్నారు.

ఉప్పునీటి సాగును అరికట్టాల్సిందే

పర్యావరణ పరిరక్షణకు, వరిసాగు సంరక్షణకు ఉప్పునీటితో సాగు చేసే ఆక్వా చెరువులను అరికట్టాలని ప్రజలు, పర్యావరణవేత్తలు గగ్గోలు పెడుతున్నారు. అధికారుల అవినీతి కారణంగానే ఇలాంటి అక్రమాలు చోటు చేసుకుంటున్నాయని వారు తీవ్రంగా మండిపడుతున్నారు. ఎవరో కొంతమంది ఆక్వా రైతుల కోసం నియోజకవర్గంలోని లక్షల మంది జనాభాను ఇబ్బందులకు గురిచేస్తూ ఆరోగ్యాలు పాడుచేస్తూ, తాగునీటిని కాలుష్యం చేస్తూ ఉంటే అధికారులు ప్రజాప్రతినిధులు ఎందుకు మౌనం వహిస్తున్నారో? అర్థం కావడం లేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అధికారులు వెంటనే స్పందించాలి



నియోజకవర్గంలోని వేలాది ఎకరాల్లో అక్రమంగా వేసిన ఉప్పునీటి బోర్లు గుర్తించి వాటిని తొలగించాలి. పర్యావరణానికి ఎంతో హాని కలిగిస్తున్న చర్యలపై అధికారులు ఉదాసీనంగా ఉండకుండా కఠినంగా వ్యవహరించాలి. అంతకూ కావాలంటే ఆక్వారైతులు చట్ట ప్రకారం దరఖాస్తు చేసుకుంటే అధికారులు పరిశీలించి అనుమతులు ఇవ్వాలి.

– గొంతే హరీష్, పాందువ్వ

సర్వే చేసి చర్యలు తీసుకోవాలి



నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో అక్రమంగా ఉన్న బోర్లు గుర్తించేందుకు అధికారులు వెంటనే సర్వే నిర్వహించాలి. అక్రమంగా వున్న బోర్లు సీజ్ చేయాలి. ఎంతకాలం నుండి వాటిని వినియోగిస్తున్నారో? గుర్తించి తగిన జరిమానా విధించాలి. అక్రమంగా కొమ్ముకాస్తున్న అధికారులపైనా తగిన చర్యలు తీసుకోవాలి.

– దానం విద్యాసాగర్, న్యాయవాది,పాముపర్రు

దళితుల పంట భూమిని శ్మశాన వాటిక అనడం తగదు

భీమవరం అర్బన్: దిరుసుమర్రు గ్రామానికి చెందిన గూడపాటి శాంతారావు భూమిని శ్మశాన వాటిక భూమి అనడం తగదని దళిత జేఏసీ కన్వీనర్ బందెల రాజు అన్నారు. ఇటీవల గూడపాటి శాంతారావు భూమిని ఆయన వారసులు తవ్వుతుండగా దిరుసుమర్రు గ్రామానికి చెందిన కొంత మంది ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు వద్దకు వెళ్లి స్మశాన వాటికకు చెందిన భూమి అని చెప్పడంతో భీమవరం మండలంలోని దిరుసుమర్రు గ్రామంలో దళిత సంఘాల ఆధ్వర్యంలో మంగళవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా దళిత జేఏసీ కన్వీనర్ బందెల రాజు మాట్లాడుతూ గతంలో గూడపాటి శాంతారావు భూమి మీదుగా కొంతమంది కాలినడక వెళ్లేవారని అనంతరం తమకు గిఫ్ట్‌గా రాసిచ్చారని పంచాయతీ రికార్డుల్లో ఫోర్జరీ చేశారని రెవెన్యూ అధికారులు స్పందించకపోతే వారిపై కేసు చేస్తామని హెచ్చరించారు. ఈ ధర్నా కార్యక్రమంలో దళిత ఐక్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు గంటా సుందర్ కుమార్, పరవు విజయ్ కుమార్, తలకాయల జాన్ కెనడీ, ఈదా దానియేలు, తోకల మార్గరాజు, టి. థామస్ తదితరులు పాల్గొన్నారు.

నేడు కాళ్లకూరు వెంకన్న హుండీ ఆదాయం లెక్కింపు

కాళ్ల: మండలంలోని కాళ్లకూరులో ఉన్న స్వయంభూ శ్రీ వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో బుధవారం ఉదయం 9 గంటల నుంచి స్వామి వారి హుండీల ఆదాయాన్ని లెక్కిస్తామని దేవస్థానం ఈఓ ఎం.అరుణ్ కుమార్ తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. దేవదాయ ధర్మాదాయ శాఖ భీమవరం తనిఖీదారు, గ్రామస్తులు, భక్తులు సమక్షంలో స్వామివారి హుండీలు తెరిచి లెక్కిస్తామని స్పష్టం చేశారు.

సివిల్ ఇంజనీర్స్ మరింతగా అధ్యయనం చేయాలి



భీమవరం ఎస్ఆర్‌కేఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో మాట్లాడుతున్న మనోరంజన్ పరిడా

భీమవరం: దేశంలో మౌలిక సదుపాయాల కల్పనలో భాగంగా రోడ్డు నెట్‌వర్క్ సిస్టమ్ మెరుగుపర్చలంటే సివిల్ ఇంజనీర్స్ మరింతగా అధ్యయనం చేయాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని కేంద్ర ప్రభుత్వ సంస్థ సీఎస్ఐఆర్ డైరెక్టర్ మనోరంజన్ పరిడా అన్నారు. భీమవరం ఎస్ఆర్‌కేఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో బి అప్లికేషన్ ఆఫ్ జియో సింథటిక్స్ ఇన్ రోడ్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ ప్రాజెక్ట్ అనే అంశంపై ఐదు రోజులు నిర్వహించే శిక్షణను మంగళవారం ప్రారంభించిన సందర్భంగా మాట్లాడారు. సింథటిక్ రోడ్డు నిర్మాణం గురించి డాక్యుమెంట్లను అధ్యయనం చేయాలని నొక్కి చెప్పారు. దేశవ్యాప్తంగా ప్రస్తుత విద్యా సంవత్సరంలో వెయ్యి మంది విద్యార్థులకు శిక్షణ అందించాలని లక్ష్యంగా కృషి చేస్తున్నట్లు తెలిపారు. శిక్షణ పొంది నైపుణ్యం ప్రదర్శించిన వారిలో 10 శాతం మందికి ఇంటర్న్ షిప్ సౌకర్యం కూడా కల్పిస్తున్నట్లు ఆయన వెల్లడించారు. చీఫ్ సైంటిస్ట్ అండ్ ప్రాజెక్ట్ లీడర్ పీఎస్ ప్రసాద్ మాట్లాడుతూ నిరంతరం అధ్యయనం చేస్తే వినూత్నంగా మరిన్ని నిర్మాణాలు చేపట్టవచ్చునన్నారు. ప్రిన్సిపల్ సైంటిస్ట్ అండ్ కోఆర్డినేటర్ భరత్ మాట్లాడుతూ డిజైన్ అంశాలలో శ్రద్ధ తీసుకోవడం వల్ల బడ్జెట్ నియంత్రణలో ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో చీఫ్ సైంటిస్ట్ అండ్ హెడ్ కన్సర్సింగ్, చీఫ్ సైంటిస్ట్ అండ్ హెడ్ ఐఎల్‌టి కైత రవీందర్, కళాశాల డైరెక్టర్ ఎం జగపతిరాజు, పాలకవర్గం సభ్యుడు సాగి సత్యప్రతీక్‌వర్మ, ప్రిన్సిపల్ కెవి మురళీకృష్ణంరాజు, ఆర్అండ్‌డి డీన్ టి వంశీ నాగరాజు, సివిల్ ఇంజనీరింగ్ హెడ్ శ్రీబాల తదితరులు పాల్గొన్నారు.

22న మెగా ప్లేస్‌మెంట్ డ్రైవ్

ఆకివీడు: నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించే దిశగా ఈ నెల 22న మెగా ప్లేస్‌మెంట్ డ్రైవ్ కార్యక్రమాన్ని మండలంలోని దుంపగడప గ్రామంలోని వీవీ గిరి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో నిర్వహిస్తున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి పి.లోకమాన్ తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఆయన ఒక ప్రకటనలో విడుదల చేశారు. ఈ ప్లేస్‌మెంట్ డ్రైవ్‌లో మోహన్ స్పిన్నింగ్, ఇండస్ ఇండ్ బ్యాంకు, ముత్తూట్ ఫైనాన్స్, అరబిందో ఫార్మ సూర్యమిత్ర ఎగ్జిమ్ లిమిటెడ్, అపోలో ఫార్మసీ వంటి కంపెనీల్లో ఫిట్టర్, ఎలక్ట్రీషియన్, సూపర్‌వైజర్, ఫార్మా అసిస్టెంట్, మెషీన్ ఆపరేటర్, లోన్ ఆఫీసర్ వంటి పోస్టులకు సుమారు 500లకు పైగా ఉద్యోగావకాశాలున్నాయని పేర్కొన్నారు. 18–35 సంవత్సరాలున్న స్త్రీ, పురుష నిరుద్యోగ యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు 86885 94244, 70138 96277 నంబర్లకు ఫోన్ చేయాలని సూచించారు.

నూతన సాంకేతికతలపై దృష్టి సారించాలి



విద్యార్థులను అభినందిస్తున్న దృశ్యం

భీమవరం: నూతన సాంకేతికతలపై దృష్టి సారించడానికి ఆర్అండ్‌డీ షోకేస్ ఎంతగానో దోహదపడుతుందని భీమవరం విష్ణు మహిళా ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ జి శ్రీనివాసరావు అన్నారు. మంగళవారం కళాశాలలో ఆర్అండ్‌డీ షోకేస్ కార్యక్రమం ప్రారంభం సందర్భంగా ఆయన మాట్లాడారు. విద్యార్థులు, అధ్యాపకులు తమ పరిశోధనాత్మక విద్యా ప్రాజెక్టులను ప్రదర్శించేందుకు ఇది చక్కటి అవకాశమన్నారు. ఈ సందర్భంగా కంప్యూటర్ సైన్స్, ఏఐ అండ్ ఎంఎల్, ఎలక్ట్రానిక్స్, ఎలక్ట్రికల్, మెకానికల్, సివిల్ ఇంజనీరింగ్ విభాగాల విద్యార్థులు ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్, స్మార్ట్ అగ్రికల్చర్, ఆరోగ్య సాంకేతికతలు తదితర రంగాలకు సంబంధించిన 200 పరిశోధనలను ప్రదర్శించారు. వాటిలో ప్రతి విభాగం నుంచి అత్యుత్తమమైన మూడు ప్రాజెక్టులను ఎంపిక చేసి అవార్డులను అందజేశారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ పి వెంకటరామరాజు, డైరెక్టర్ ఆదెల రాజు, డీన్ జీఆర్ఎల్‌వీఎస్ఎస్ రాజు, కోఆర్డినేటర్ దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సూపర్ సిక్స్ హామీలను అమలు చేయాలి

భీమవరం అర్బన్: కూటమి ప్రభుత్వం ఎన్నికల హామీలను అమలు చేయాలని సీపీఐ మండల కార్యదర్శి ఎం. సీతారామ ప్రసాద్ అన్నారు. భీమవరం మండలంలోని నాగిడిపాలెం గ్రామంలో సీపీఐ ఆధ్వర్యంలో ఇళ్లు లేని వారికి ఇళ్ల స్థలాల దరఖాస్తులను పూర్తి చేసే కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా సీపీఐ మండల కార్యదర్శి సీతారామ ప్రసాద్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 9 నెలలు గడుస్తున్నా ఇప్పటివరకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఒక్క హామీ కూడా అమలు చేయలేదన్నారు. ఎన్నికల సమయంలో సొంతిళ్లు లేని వారికి పట్టణంలో 2 సెంట్లు, గ్రామాల్లో 3 సెంట్లు ఇస్తామని హామీ ఇచ్చారన్నారు. జనవరి నుంచి ఇళ్లు నిర్మించుకునేందుకు అనువైన కాలమని మళ్లీ వర్షాలు పడితే ఇబ్బందులు ఎదుర్కొంటారన్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రజా నాట్యమండలి జిల్లా నాయకులు చాంద్ బాషా మాట్లాడుతూ మహిళలకు ఉచిత బస్సు, తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ, నిరుద్యోగ భృతి ఇలా ఎన్నో హామీలు ఇచ్చారని వాటి కోసం ప్రజలు ఆశతో ఎదురు చూస్తున్నారన్నారు. గ్రామీణ ప్రాంతాలలో రోడ్లు ధ్వంసమై ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. 9 నెలలు గడుస్తున్నా ఇప్పటివరకు ఎన్నికలలో ఇచ్చిన హామీలను కూటమి ప్రభుత్వం నెరవేర్చకపోవడంతో ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారన్నారు. ఇప్పటికైన ఎన్నికలలో ఇచ్చిన హామీలను నెరవేర్చి ప్రజల విశ్వాసాన్ని పొందాలని లేకుంటే రాబోయే రోజుల్లో ప్రజలే బుద్ధి చెబుతారన్నారు. ఈ కార్యక్రమంలో నాగిడిపాలెం కార్యదర్శి నాగిడి నాగరాజు, తిరుమాని శ్రీరాములు, నాగిడి నరసింహ స్వామి, తిరుమాని విమలాదేవి, రావమ్మ, నాగిడి నాగమణి, లబ్ధిదారులు పాల్గొన్నారు.

మైక్రో ఫిల్టర్ పనుల పరిశీలన



చెరుకువాడలో మైక్రో ఫిల్టర్ పనులు పరిశీలిస్తున్న సర్పంచ్ శివయ్య

ఉండి: గ్రామంలో మైక్రో ఫిల్టర్‌ల ఏర్పాటుతో త్రాగు నీటి సమస్యకు పరిష్కారం లభించినట్లేనని చెరుకువాడ గ్రామ సర్పంచ్ కొండవేటి సాంబశివరావు అన్నారు. గ్రామంలో రూ.10లక్షల ఎమ్మెల్యే నిధులతో కాపులపేట,రాజులపేట ప్రాంతాల్లో నిర్మాణం చేపట్టిన మైక్రో ఫిల్టర్‌ల పనులను మంగళవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవికి ముందు గ్రామంలో మైక్రో ఫిల్టర్‌ల ఏర్పాటుతో స్వచ్ఛమైన తాగునీటికి శివారు ప్రాంతాలకుకూడా అందిస్తామని అన్నారు. ప్రస్తుతం కాపులపేటలో మైక్రో ఫిల్టర్ పూర్తి కావొచ్చిందని కొద్దిరోజుల్లోనే రాజులపేటలో పనులు కూడా పూర్తవుతాయని ఆయన తెలిపారు. కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్యదర్శి సుభాషిణి, వార్డు సభ్యుడు ఉంగరాల నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ఉత్తమ నాటిక ప్రదర్శనగా 'చిగురు మేఘం'



ఉత్తమ ప్రదర్శన బహుమతి అందుకుంటున్న 'చిగురు మేఘం' నటులు

పాలకొల్లు సెంట్రల్: కళాకారులు తమ నటనలో ఎంత గొప్పగా ప్రదర్శనలు చేసినా ఆ కళలను అభిమానించే కళాభిమానులు ఉంటేనే నటించిన కళకు గుర్తింపు ఉంటుందని పాలకొల్లు కళాపరిషత్ అధ్యక్షుడు కేవీ కృష్ణవర్మ అన్నారు. సోమవారం రాత్రి ముగిసిన పాలకొల్లు కళాపరిషత్ పోటీల్లో ఉత్తమ ప్రదర్శనగా చిగురు మేఘం నిలిచింది. ఈ సందర్భంగా బహుమతి ప్రదానోత్సవ కార్యక్రమంలో పలువురు వక్తలు మాట్లాడుతూ సినిమాల్లో నటించడమే సులభమని అక్కడ సీన్ రక్తికట్టించే వరకూ అనేక టేకింగ్‌లు తీసుకోవచ్చని అన్నారు. నాటిక ప్రదర్శనలు అలా కాదని ఒకసారి రంగంలోకి దిగిన తరువాత తప్పు సరిదిద్దుకోవడానికి అవకాశం ఉండదన్నారు. ఈ ప్రదర్శనలకు ఎంతో గొప్ప నటనాచాతుర్యం ఉండాలన్నారు. మూడు రోజులు పాటు జరిగిన కళాపరిషత్ నాటిక పోటీలు సోమవారం ఘనంగా ముగించారు. ద్వితీయ ఉత్తమ ప్రదర్శనగా అసత్యం, తృతీయ ప్రదర్శన కిడ్నాప్ నాటికలు గెలుపొందాయి. జ్యూరీ ప్రదర్శన బ్రహ్మస్వరూపం నాటిక ఎంపికైంది. ఉత్తమ రచయితగా వల్లూరి శివప్రసాద్ విడాకులు కావాలి, ఉత్తమ దర్శకుడిగా పి.బాలాజీ నాయక్ అసత్యం, ఉత్తమ నటుడు కావూరి సత్యనారాయణ, చిగురు మేఘం, ఉత్తమ నటి బి.నాగమణి, ఇది రహదారి కాదు, ఉత్తమ ప్రతినాయకుడు వై.అనిల్‌కుమార్, అసత్యం, ఉత్తమ హాస్య నటుడిగా పి.పండు మా ఇంట్లో మహాభారతం , ఉత్తమ రంగాలంకరణ బ్రహ్మస్వరూపం, ఉత్తమ సంగీత దర్శకుడిగా అసత్యం నాటికతో పాటు వివిధ టగిరిల్లో కళాకారులు మరిన్ని బహుమతులను గెలుచుకున్నారు. ఈ కార్యక్రమంలో సెక్రటరీ మానాపురం సత్యనారాయణ, వితాకుల రమణ, డాక్టర్ వర్మ, సినీ దర్శకుడుగరాపి వెంకటరమణ, తాడేపల్లిగూడెం కళాపరిషత్ అధ్యక్షులు బుద్దాల వెంకట రామారావు, మేడికొండ శ్రీనివాసు, జక్కంపూడి కుమార్, కొణిజేటి గుప్త తదితరులు పాల్గొన్నారు.

చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలి

పాలకొల్లు సెంట్రల్: మత్తు పదార్థాలు, ధూమపానం మొదలైన చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ టి.రాజరాజేశ్వరి అన్నారు. మంగళవారం స్థానిక అద్దేపల్లి సత్యనారాయణమూర్తి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈగల్ క్లబ్, డ్రగ్ ఫ్రీ ఆంధ్ర ప్రదేశ్ కమిటీ వారి సంయుక్త ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ రాజరాజేశ్వరి మాట్లాడుతూ చెడు వ్యసనాలకు యువత దూరంగా ఉంటూ మంచి నడవడికతో ఉన్నత శిఖరాలను అధిరోహించాలన్నారు.

తాగి రోడ్డెక్కితే జైలే!

- బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించినా జరిమానా తప్పదు
- టూటౌన్ ప్రాంతంలో విస్తృతంగా టెస్ట్‌లు, గాలింపు చర్యలు
- డ్రోన్ కెమెరాతో గాలింపులకు సన్నద్ధమవుతున్న పోలీసులు



భీమవరంలో బహిరంగ ప్రదేశంలో మద్యం సేవిస్తున్న వారితో మాట్లాడుతున్న పోలీసులు



భీమవరంలో డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్ట్‌లు చేస్తున్న దృశ్యం

భీమవరం: పట్టణంలో మద్యం సేవించి వాహనం నడుపుతూ పోలీసులకు దొరికినా, బహిరంగ ప్రదేశంలో మద్యం సేవించినా అంతేసంగతులు. పోలీసులకు చిక్కిన వారికి భారీ జరిమానాలు తప్పడం లేదు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం మద్యం విక్రయాలకు గేట్లు ఎత్తివేయడంతో మద్యం దుకాణాలు, బెల్ట్‌షాపుల వద్ద అమ్మకాలు జోరందుకున్నాయి. మద్యం షాపుల వద్ద సిట్టింగ్స్ ఏర్పాటు చేసి విక్రయాలు చేస్తున్నా పట్టించుకున్న నాథుడు కన్పించడం లేదు. మద్యం షాపుల వద్దనే కూల్‌డ్రింక్స్, తినుబండారాలు అందుబాటులో ఉండడంతో మద్యం ప్రియులకు పండుగగా మారింది. దీనితో పూటుగా మద్యం సేవించి వాహనాలు నడపడంతో అనేక ప్రమాదాలు జరుగుతున్నాయి. దీనితో ప్రమాదాలను అరికట్టడానికి పోలీసులు ప్రత్యేక డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు నమోదు చేస్తున్నారు. ప్రధానంగా భీమవరం టూటౌన్ పరిధిలో సర్కిల్ ఇన్‌స్పెక్టర్ జి.కాళీచరణ్ తన సిబ్బందితో ప్రతి రోజు రాత్రి 10 గంటల నుంచి వివిధ ప్రాంతాల్లో కాపుకాచి డ్రంక్ అండ్ డ్రైవ్‌ను అరికట్టేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టారు. ద్విచక్రవాహనాలపై వెళ్తున్న వారిని ఆపి డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్ట్‌లు చేస్తున్నారు. దీనిలో పట్టుబడిన వారిని జడ్జి ముందు హాజరుపర్చడంతో జరిమానలు తప్పడం లేదు. దీనిలో భాగంగా అంబేడ్కర్ సెంటర్, పద్మాలయ థియేటర్, గరగపర్రు రోడ్డులోని బివి రాజు విగ్రహం తదితర ప్రాంతాల్లో మద్యం సేవించి బైక్ నడుపుతున్నవారిని అరెస్టు చేసి నేరుగా జడ్జిముందుగా హాజరుపర్చగా పట్టుబడ్డ ఒక్కొక్కరికీ రూ. 10 వేలు చొప్పున జరిమాన విధిస్తున్నారు. ఇటీవల డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడ్డ 18 మందిని జడ్జిముందు హాజరుపర్చగా మొత్తం రూ.1.80 లక్షలు జరిమానా విధించారు. ఇంతటితో ఆగకుండా వివిధ ప్రాంతాల్లో బహిరంగంగా మద్యం సేవిస్తున్న వారిపైనా కొరడ ఝుళిపిస్తున్నారు. వివిధ రంగాల్లో పనిచేసే కార్మికులు, యువకులు రాత్రి సమయంలో మద్యం సేవించడం పరిపాటిగా మారింది. అదే సమయంలో అటుగా వెళుతున్న మహిళలు, యువతుల పట్ల అసభ్యకరంగా ప్రవర్తిస్తున్నారు. ఇటువంటి కొన్ని సంఘటనలు పోలీసుల దృష్టికి రావడంతో పోలీసులు గస్తీని ముమ్మరం చేశారు. ముందుగా హెచ్చరికలు చేయగా తర్వాత మద్యం సేవించిన వారిని న్యాయమూర్తి వద్ద హాజరుపరుస్తున్నారు. ఈ విధంగా 54 మందిని జడ్జి ముందు హాజరుపర్చగా వారిలో 19 మందికి రూ. 1,000, 35 మందికి రూ. 500 చొప్పున అపరాద రుసుం విధించారు. దీంతో భీమవరం పట్టణంలో డ్రంక్ అండ్ డ్రైవ్, బహిరంగప్రదేశాల్లో మద్యం సేవించే వారిలో కొంత భయం ఏర్పడింది. బహిరంగ ప్రదేశాల్లో పేకాట, అసాంఘిక కార్యకలాపాలను గుర్తించడానికి డ్రోన్ కెమెరాలను వినియోగిస్తున్నారు. ఇటీవల వన్‌టౌన్ ఏరియాలో తప్పిపోయిన బాలికను గుర్తించడానికి డ్రోన్ కెమెరా ఉపయోగించి పోలీసులు విజయం సాధించడంతో డ్రోన్ కెమెరాలను విస్తృతంగా వినియోగించేందుకు సన్నద్ధమవుతున్నారు.

కఠిన చర్యలు తప్పవు



మద్యం సేవించి వాహనాలు నడిపినా, బహిరంగంగా మద్యం సేవించినా చట్టపరమైన చర్యలు తప్పవు. ఇప్పటికే వివిధ ప్రాంతాల్లో ప్రత్యేక చర్యలు చేపట్టి అరెస్టులు చేస్తున్నాం. రానున్నరోజుల్లో ప్రత్యేక పోలీసు బృందాల ద్వారా మరింత విస్తృతంగా గాలింపు, డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్ట్‌లు చేసి మద్యం సేవించి వాహనాలు నడపకుండా చర్యలు తీసుకుంటాం.

– జి.కాళీచరణ్, టూటౌన్ సీఐ, భీమవరం

ఎస్సీ వర్గీకరణను నిలిపి వేయాలి

నరసాపురం: ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా కూటమి ప్రభుత్వం బిల్లు తీసుకురావడాన్ని నిరసిస్తూ మంగళవారం పట్టణంలోని అంబేడ్కర్ సెంటర్‌లో మాలల ఐక్య వేదిక ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేసి ఆందోళన చేశారు. అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సంఘ నాయకులు మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ రాజ్యంగ విరుద్ధమన్నారు. ఎస్సీ వర్గీకరణ విషయంలో కూటమి ప్రభుత్వం ముందుకెళ్లకూడదని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో దళిత సంఘాల నాయకులు ఇంజేటి జాన్ కెనడీ, సోడదాసి శ్రీధర్, దొండపాటి స్వాములు పాల్గొన్నారు.